క్లుప్తంగా

గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే


స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు తెలుపుతున్న గ్రామస్తులు

పెనగలూరు : మండలంలోని కొత్త సింగనమల గ్రామంలో గంగమ్మతల్లి జాతర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, సాయివికాస్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కొత్త సింగనమల గ్రామస్తులు సమస్యలను తెలియజేశారు. అనంతరం చిట్వేలి మండలం తిమ్మయ్యగారిపల్లెకు చెందిన మద్దిపట్ల రామయ్య పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళి అర్పించారు.

కూలీలకు పనులు కల్పించండి


మాట్లాడుతున్న ఏపీఓ శివశంకర్‌రెడ్డి

ఒంటిమిట్ట : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసేందుకు కూలీల శాతాన్ని పెంచాలని ఏపీఓ శివశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖకు సంబంధించి మండలానికి వచ్చిన 200 ఎకరాల లక్ష్యంలో 110 ఎకరాలు మాత్రమే రైతులు నమోదు చేసుకున్నారని, మిగిలిన 90 ఎకరాలను రైతులను ప్రోత్సహించి నమోదు చేసుకునేలా చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో ముత్తూట్ ఎంజాత్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో జాన్ ప్రసాద్, అబ్దుల్ రెహ్మాన్‌ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులకు వైద్యం అందించారు. సుమారు 150 మందికి పైగా వైద్య సేవలు అందుకున్నారు. అలాగే మందులు పంపిణీ చేశారు.

ఎస్టీయూ నేతకు సన్మానం


రామకృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు : ఎస్టీయూ రాష్ట్ర ప్రచార కన్వీనర్ పిల్లి రామకృష్ణను బుధవారం పెనగలూరు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రామకృష్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి.ఎల్లయ్య, ఉపాధ్యాయులు బివి రాఘవరెడ్డి, రవిశంకర్, ఎం.నారాయణమ్మ, లక్ష్మీదేవి, వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు



సుండుపల్లె : మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

చిట్వేలి : విజువలీ క్లీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నక్కలపల్లి పంచాయతీలోని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ మద్దిన రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి జయలత పారిశుధ్య పనులు చేయించారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, చెత్త దిబ్బలను , పిచ్చి మొక్కలను తొలగించడం, మురిగి కుంటలను పూడ్చడం, బ్లీచింగ్ చల్లించడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు.

సుండుపల్లె : ఈఓపీఆర్డీ సురేష్ బాబు ఆదేశాల మేరకు బుధవారం పంచాయతీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు మండల పరిధిలోని సుండుపల్లె టౌన్, ఏటిగడ్డ రాచపల్లి తదితర గ్రామాలలో శానిటేషన్ వర్క్‌లో భాగంగా పుర వీధులలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపడతామని ఈఓపిఆర్డీ సురేష్ బాబు తెలియజేశారు.

అమృతం కన్నా..
అమ్మపాలు మిన్న

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- తొలి ఆరు మాసాలు తల్లిపాలే బిడ్డకు ఆహారం
- అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు



మండల పరిధిలోని సెక్టార్ల వారీగా వివరాలు..

సెక్టార్లు	కేంద్రాలు	బాలింతలు	గర్భిణులు	0-6 నెలల పిల్లలు
సంబేపల్లె	23	99	80	99
శెట్టిపల్లె	23	59	47	60
గున్నికుంట్ల	22	58	58	58
దేవపట్ల	25	53	56	53

సంబేపల్లె / చిన్నమండెం : పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా తల్లిపాలే. పిల్లలకు అవే అమృత తుల్యం. బిడ్డ శారీరకంగా ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయని వైద్యుల సూచన. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత వేగంగా ముర్రుపాలు తాగించాలి. దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లిపాల ఆవశ్యకత తెలిపేలా ప్రతి సంవత్సరం ఆగస్టు తొలివారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు.

తల్లిపాలు తాగే పిల్లలు బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి, తెలివితేటలు ఎక్కువే. తల్లిపాలు తాగే బిడ్డలో దవడల కదలిక ఎక్కువ, ఇది శరీరంలో అన్ని అవయవాలకు మేలు చేస్తుంది. బిడ్డకు పాలివ్వడం ద్వార తల్లి బిడ్డకు అనుబంధం ఏర్పడుతుంది. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తల్లిపాల ఆవశ్యకత, బిడ్డపోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టి బిడ్డకు తల్లిపాలు దూరం చేయరాదు. ముర్రుపాలు ఎంతవేగంగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యకరం. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

సంబేపల్లె మండల పరిధిలో 93 అంగన్‌వాడీ కేంద్రాల్లో 270 మంది పిల్లలు, 269 మంది తల్లులు ఉన్నారు. వీరికి తల్లుల ప్రాముఖ్యతను తెలిపేందుకు ఉద్యోగులు, ఆశలు, సూపర్‌వైజర్లు సన్నద్ధంగా ఉన్నారు. ముర్రుపాలతో రోగనిరోధక శక్తి, శిశువు జన్మించిన తొలిరోజుల్లో తల్లిపాలు చిక్కగా పసుపురంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ప్రోటీన్లు అధికంగా వుండడంతో వీటిని శిశువు తీసుకోవడం ద్వార రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంటలోపే ఈ పాలు పట్టడం ద్వార చాలా రోగాల నుంచి శిశువును రక్షించుకోవచ్చు. ముర్రుపాలలో విటమిన్ ఏ,బీలతో పాటు ఐరన్ విలువలు ఉంటాయి. ముర్రుపాలు శిశువు పేగులకు బలాన్ని ఇచ్చి, జీర్ణ శక్తిని పెంచుతాయి. కామెర్లు, వీరేచనాలు వంటి రుగ్మతుల నుంచి శిశువును కాపాడుతాయి.


అంగన్‌వాడీ కేంద్రం

ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం



వైద్యులు బిడ్డ పుట్టాక ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పని పరిస్థితిలో మినహా బిడ్డకు వేరే ఏ పాలు తాపకూడదు. మొదటి నెలలో బిడ్డ ఏడ్చిన సమయంలో, రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకు ఒకసారి (రాత్రులైనా) పాలు పట్టాలి. రాత్రులతోపాటు ఇవ్వడం వల్ల తల్లి మెదడు నుంచి ప్రోలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి కావాల్సిన అతి ముఖ్యమైన హార్మోన్, మొదట ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వార బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోస, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలకు ఎంతో రక్షణనిస్తాయి. ఆరు మాసాల తర్వాత తల్లిపాలతోపాటు వైద్యుల సూచన మేరకు ఆహారం ఇవ్వాలి. రెండు సంవత్సరాలపాటు బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లి ఆరోగ్యం బాగుంటుంది. **- సూర్యనారాయణరెడ్డి, వైద్యులు సంబేపల్లె పీహెచ్‌సీ**

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాపించాలి. తల్లికి అన్ని రకాల ఆహారం పెట్టాలి. 6 నెలల తర్వాత తల్లిపాలతోపాటు ఇంట్లో తినే ఆహారం మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు 2 సంవత్సరాలపాటు తల్లి పాలు కొనసాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బంది తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ, అవగాహనా సదస్సులు నిర్వహిస్తాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో 7 రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి. **- శశికళ, ఐసీడీఎస్ పీడీ, అన్నమయ్య జిల్లా**

విద్యతోనే సమాజంలో గౌరవ మర్యాదలు

సబ్‌కలెక్టర్ మైఖోమ్ నిదియాదేవి


సబ్‌కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు అడుగులు పడేది విద్యార్థి దశలోనే అని సబ్‌కలెక్టర్ మైఖోమ్ నిదియాదేవి తెలిపారు. ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం సబ్‌కలెక్టర్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. తాను ఆరవ తరగతి నుంచి వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తనకు పాఠశాల రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. విద్యతో పేదరికం దూరం కావడమే కాక సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. అందువల్ల విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే నేరుగా తన కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చన్నారు. కాగా 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిని ధరిణి (ఊటుకూరు జెడ్పీ హైస్కూల్), ద్వితీయ బహుమతిని సాదియా (బీవీఎన్ స్కూల్), తృతీయ బహుమతిని గీతిక (మన్నూరు జెడ్పీ హైస్కూల్) విద్యార్థినులు గెలుపొందారు. అలానే పలువురు విద్యార్థినులకు కన్సోలేషన్ బహుమతులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్, ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


డీఈఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆర్ఎస్‌యూ

రాయచోటి అర్బన్ : జిల్లాలో గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ విద్యాశాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయం ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలోని గుర్తింపు లేకుండా సమిష్టి విద్యాలయం పేరుతో పాఠశాల నడుపుతున్నారన్నారు. పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేవన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించడం లేదని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎలాంటి వసతులు లేకుండా పాఠశాలను నిర్వహిస్తుండడం దారుణమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సదరు పాఠశాలపై కఠినచర్యలు తీసుకోవాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈఓ శివప్రకాష్‌రెడ్డికి ఒక వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వంశీరెడ్డి, జిల్లానేతలు వెంకటేశ్వర్లు, కల్యాణ్, నూర్ మహమ్మద్, సందీప్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి


ఎస్టీయూ నాయకులను సన్మానించిన దృశ్యం

రాజంపేట టౌన్ : సామాజిక సేవలోనే నిజయమైన సంతృప్తి ఉంటుందని రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఎస్టీయూ రాజంపేట శాఖ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బల్లలను ఏర్పాటు చేయడంపై బుధవారం భానుమూర్తిరాజు ఎస్టీయూ నాయకులను స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ నాయకులు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమని కొనియాడారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ సమాజసేవలో ఎస్టీయూ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ఎంఈఓలు రఘునాథరాజు, సుబ్బరాయుడులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేపట్టే సామాజిక కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకం కాగలవని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, చంద్రశేఖర్, శంకర్‌నాయక్, లోకేశ్వర్‌రాజు, మురళీమనోహర్, నరసింహ, ఓబులేసు, సత్యనారాయణ, స్వామినాధం, సుబ్బారెడ్డి, భాస్కర్, ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఆర్‌ఓ సత్యనారాయణకు యూటీఎఫ్ నేతలు విన్నవించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా కార్యదర్శి షేక్‌జాబీర్‌లు కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలుపరచిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెరిగిన పని భారంతో పాటు సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని, ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది నియమించాలన్నారు. అనంతరం ఈ మేరకు డీఆర్‌ఓకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతు రాజా రమేష్, శివమోహన్‌లు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం కూల్చినవారిపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు నరేష్

పీలేరు రూరల్ : ములకలచెరువులో బీసీ హాస్టల్ భవనం కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని మాల స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాయలసీమ అధ్యక్షుడు మలతోటి నరేష్ డిమాండ్ చేశారు. ములకలచెరువు నందు బీసీ బాలుర హాస్టల్‌కు ఓనరు రమణమ్మ తన భవనంను అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల హాస్టల్ భవనాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కూల్చివేశారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఆ భవనంకు పంచాయతీ పన్నులు, కరెంటు బిల్లులు అన్నీ ఉన్నాయని తెలిపారు. బిల్డింగ్ కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకుని రమణమ్మకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సత్కారం

రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్‌రావును సన్మానించిన ఎమ్మెల్యే ఆకేపాటి


పుల్లంపేట: పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ నిరంజన్


నందలూరు: జయభాస్కర్‌రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


సుండుపల్లె: రామచంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


సుండుపల్లి: నూరుల్లా దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

నందలూరు : సీనియర్ రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.జయభాస్కర్ రావు గత నలభై సంవత్సరాలుగా రైల్వే ఉద్యోగులకు చేసిన సేవలు ఎనలేనివని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండలంలోని పాటూరు పంచాయతీ ఎర్రిపాపయ్యగారిపల్లెలో గ్రామంలోని విభ ఎయిడెడ్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం డాక్టర్ జయభాస్కర్ రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఫ్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, భూమన శివ శంకర్ రెడ్డి, గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, గుండు మల్లికార్జున రెడ్డి, ఆనాల మధు యాదవ్, మధురాజు, సుధ, మాభాష, ఎముక దుర్గయ్య, మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, గుంతకల్ డివిజన్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డీఓఎం శ్రావణ్ కుమార్, ఐఆర్టీఎస్ మనోజ్, విశ్రాంత పిఎస్ ఎండి నాయక్, రిటైర్డ్ సిపిఎంఎస్ ప్రభాకర్ రాజు, రిటైర్డ్ ఎంఎస్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సీసీ పదవీ విరమణ

పుల్లంపేట : వెలుగు సీసీగా ఇరవై సంవత్సరాల పాటు పనిచేస్తున్న ప్రకాష్ బుధవారం పదవీ విరమణ పొందారు. దీంతో పుల్లంపేటలోని వెలుగు కార్యాలయంలో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ పుల్లంపేట వెలుగు కార్యాలయంలో ప్రకాష్ క్లస్టర్ సీసీగా విధులు నిర్వర్తిస్తూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీసీలు ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నూరుల్లాకు..

సుండుపల్లి : మండల పరిధిలోని గుట్టకిందరాచపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన షేక్ నూరుల్లాను పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఎస్టీయూ మండల అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, ఆరిపుల్లా, ఇస్మాయిల్, నాగరాజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

పదవీ విరమణ సందర్భంగా మండల పరిధిలోని వెంగంరాజుగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పూజారి రామచంద్రయ్య, ఆయన సతీమణి నాగ మునెమ్మలను బుధవారం ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, ఆంజనేయులు, ఆర్‌జేయూపీ నాయకులు సిద్దునాయక్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శిరీషా, తోటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన మంత్రి మండిపల్లె


వినతి పత్రాలను స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలు నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వినతిపత్రాలు అందజేసిన వారి సమస్యలను పరిశీలించిన తరువాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని చెప్పారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు సామగ్రిని ఇస్తున్న దాతలు

వీరబల్లి : మండలంలో తాటిగుంటపల్లె పంచాయతీని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. రాయచోటి లయన్స్ క్లబ్ కోశాధికారి జి.కిషోర్ రెడ్డి కుమారుడు షణ్ముక్‌రెడ్డి, ఆయన సోదరుడు కుమార్తె జశ్విత రెడ్డిల పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డిన లయన్స్ క్లబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని మచిలీవడ్డిపల్లికి చెందిన పసుపులేటి శివప్రియ తన భర్త బలరాం వేధిస్తున్నాడని స్థానిక పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శివప్రియ తన భర్త రోజూ మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడన్నారు. ఆయన వేధింపులకు తట్టుకోలేనని భార్య శివప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పా. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దొమ్మర కులస్తులను ఆదుకోవాలి


తాత్కాలిక గుడిసెల వద్ద దొమ్మర కులస్తులతో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : పట్టణ పరిసరాలలో గుడిసెలలో నివసిస్తున్న దొమ్మర కులస్తులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బుక్కే విశ్వనాథనాయక్, మండెం సుధీర్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు చిత్తూరు బైపాస్ రోడ్డు పక్కన గుడిసెలలో నివసిస్తున్న దొమ్మర కులస్తులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా మొలకలచెరువు మండలం నుంచి కొన్ని కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా రాయచోటి పట్టణ పరిసరాలలో నివసిస్తున్నారన్నారు. తాత్కాలిక టెంట్లలో నివసిస్తూ సరైన తాగునీటి, విద్యుత్ సౌకర్యం లేక, ఉపాధి పనులు దొరకక అల్లాడుతున్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకుని శాశ్వత గృహాలను నిర్మించడం, మౌలిక వసతులను కల్పించాలన్నారు. మున్సిపల్ అధికారులు వారికి ట్యాంకర్లతో నైనా తాగునీరందించాలంటూ కోరారు. సామాజిక సేవకులు ముందుకు వచ్చి వారికి సోలార్ దీపాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం నాయకుడు వి.రంగారెడ్డి, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు 2వ తేదీ మధ్యాహ్నం లోపు పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ సచివాలయం సిబ్బందికి తెలియజేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ సర్వర్ 1వ తేదీ, 2వ తేదీ మధ్యాహ్నం వరకు పని చేస్తుందని, పెన్షన్‌దారులు అందుబాటులో ఉండి పెన్షన్‌ను పొందాలన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం నుంచి పింఛన్ అందించే సర్వర్ పని చేయదని చెప్పారు. 100శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని తెలియజేశారు.

నేటి నుంచి ఉర్దూ టెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు గురువారం నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కోఆర్డినేటర్ షాజహాన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెట్‌కు హాజరయ్యే విద్యార్థులు స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9393315343 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ బోరు ప్రైవేట్ వ్యక్తుల స్వాధీనం

పీలేరు : మండలంలోని వెంకటాద్రి ఇళ్ల కొత్తపల్లె కాలనీలో ఎస్సీ, ఎస్టీల కుటుంబాల దాహార్తి తీర్చడానికి వేసిన ప్రభుత్వ బోరును ప్రైవేట్ వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు అన్నారు. బుధవారం కొత్తపల్లె కాలనీలోని బోరును పరిశీలించారు. మాట్లాడుతూ 2021-22లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వ నిధులతో తాగునీటి బోరు వేశారన్నారు. అయితే ఆ బోరును గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి పరిమితం చేసుకున్నారని తెలిపారు. దీంతో కాలనీలో నీటి సమస్య నెలకొందన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు పాల్గొన్నారు.